క్లుప్తంగా

ఉపాధి పథకాన్ని వినియోగించుకోండి



కంకిపాడు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వినియోగించుకోవాలని మంతెన సర్పంచ్ వీరంకి వెంకట రమణ అన్నారు. మండలంలోని మంతెనలో సోమవారం ఉపాధి హామీ పథకం కింద పంట బోదెల తవ్వకం పనులు ప్రారంభించారు. సర్పంచ్ వీరంకి వెంకటరమణ మాట్లాడుతూ జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్క కూలీకి ఉపాధి చూపాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా కూలీలకు వేతనాలను సకాలంలో చెల్లించాలన్నారు. వేసవి దృష్ట్యా కూలీల ఆరోగ్య పరిరక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు బండి శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సేవల్లో భాగస్వాములు కావాలి



కంకిపాడు: సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి కోరారు. మండలంలోని ఈడుపుగల్లు ఆరోగ్య ఉపకేంద్రానికి సోమవారం డాక్టర్ చిగురుపాటి లక్ష్మీనారాయణ, విక్రమ్‌శెట్టి శ్రీరామ్ ఆర్థిక వితరణతో 10 కుర్చీలు, ఫ్యాన్‌ను అందించారు. సామాజిక కార్యకర్త మురళీకృష్ణ ద్వారా ఈ సామాగ్రిని సబ్‌సెంటరుకు అందజేశారు. ఎంపీపీ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వాలతో పాటుగా దాతలు, స్వచ్ఛంద సంస్థలు సమాజ అభ్యున్నతికి వెచ్చించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పీవీఆర్వీ ఆంజనేయులు, డాక్టర్ నిఖిత, ఆప్తాలమిక్ ఆఫీసర్ రాజేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్టు

గన్నవరం: గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను సోమవారం గన్నవరం పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉంగుటూరు మండలం తేలప్రోలు గ్రామానికి చెందిన శెనగల శివనాగరెడ్డి గంజాయి తరలిస్తున్నట్లు సమాచారం వచ్చింది. దీంతో స్థానిక కోనాయి చెరువు వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి మూడు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. కేసరపల్లి పంచాయతీ కార్యాలయం సమీపంలో స్థానికుడు కొండేటి అనిల్‌ను అదుపులోకి తీసుకుని అరకేజీ గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఇద్దరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ కనకరావు తెలిపారు.

49 మంది అప్రెంటిస్‌కు ఎంపిక

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): నగరంలోని రమేష్ ఆస్పత్రి రోడ్డులో ఉన్న ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలో సోమవారం అప్రెంటిస్ మేళా జరిగింది. మొత్తం 17 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఎన్టీఆర్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో ఐటీఐ పూర్తి చేసిన 72 మంది విద్యార్థులు హాజరు కాగా వారికి ఆయా కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 49 మంది విద్యార్థులకు వారి కంపెనీల్లో అప్రెంటిస్ పూర్తి చేసేందుకు అవకాశం కల్పించారని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కనకారావు తెలిపారు.

లేబొరేటరీ మాన్యువల్ పుస్తకావిష్కరణ



కోనేరుసెంటర్: కృష్ణా విశ్వవిద్యాలయం రసాయనశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ డి.రామశేఖరరెడ్డి రచించిన ఆర్గానిక్ కెమిస్ట్రీ లేబొరేటరీ మాన్యువల్ పుస్తకాన్ని విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ కె.రామమోహనరావు సోమవారం ఆవిష్కరించారు. విద్యార్థులకు ఉపయుక్తంగా పుస్తకాన్ని రచించిన రచయిత రామశేఖరరెడ్డిని ఉపకులపతి కె.రామమోహనరావు ప్రత్యేకంగా అభినందించారు. నూతన విద్యావిధానం అనుసరించి రచించిన పుస్తకంలో రసాయనశాస్త్ర విద్యార్థులు పరిశోధనల్లో పాటించాల్సిన విధానాలతో పాటు అనేక కృత్యాలను విపులంగా వివరించామని రామశేఖర్‌రెడ్డి తెలిపారు. పుస్తకాన్ని తన గురువు పూర్వ రసాయనశాస్త్ర ఆచార్యులు వెంకటేశ్వర్లుకు అంకితమిస్తున్నట్లు పేర్కొన్నారు.

లంకమ్మవారి హుండీ ఆదాయం రూ.7.80 లక్షలు

అవనిగడ్డ: లంకమ్మవారి హుండీ ఆదాయం రూ.7,80,293 వచ్చినట్టు ఆలయ ఈవో పి.సీతారామయ్య తెలిపారు. ఆలయ ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో అమ్మవారి జాతర పూర్తయిన సందర్భంగా గత నెల 27నుంచి సోమవారం వరకూ వచ్చిన హుండీ ఆదాయాన్ని లెక్కించినట్టు చెప్పారు.

ప్రజా నినాదం.. 'మా నమ్మకం నువ్వే జగన్'

హనుమాన్‌జంక్షన్ రూరల్: వైఎస్సార్ సీపీ నాలుగేళ్ల పాలనలో కుల, మత, రాజకీయ వివక్ష లేకుండా అర్హత ఉన్న ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించడంతో 'మా నమ్మకం నువ్వే జగన్' అనే నినాదం అందరి నోట వినిపిస్తోందని ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ అన్నారు. బాపులపాడు మండలంలోని వేలేరు, రేమల్లె, వీరవల్లి, రంగన్నగూడెం, మల్లవల్లి గ్రామాల్లో సోమవారం 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులతో పాటుగా సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో కలిసి ఆయా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి నేరుగా ప్రజలను కలిశారు. గత టీడీపీ ప్రభుత్వ హయంలో చంద్రబాబు పాలనకు, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు తేడాను వివరించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నా ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని, నవరత్నాల పథకాలను నిర్దుష్ట షెడ్యూల్ ప్రకారం అమలు చేస్తున్నారని గాంధీ చెప్పారు. గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాల కోసం ప్రజలు జన్మభూమి కమిటీల చుట్టూ కాళ్లు అరిగేలా తిరగాల్సివచ్చేదని గుర్తుచేశారు. కానీ నేడు మధ్యవర్తుల ప్రమేయం లేకుండా అర్హులకు సంక్షేమ పథకాలను డోర్ డెలివరీ రూపంలో అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఆవిర్నేని శేషగిరిరావు మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని చెప్పారు. పేదల పక్షపాత ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. ప్రజల అనుమతితో ఇంటికి 'జగనన్నే మా నమ్మకం' స్టిక్కర్లను అంటించారు. జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, సర్పంచులు సరిపల్లి కమలాభాయి, సొదిమెళ్ల సుందరమ్మ, చౌటపల్లి భారతి, కట్టుబోయిన నాగమణి, ఎంపీటీసీ సభ్యులు మురుదుడ్డి యోహాన్, దూసరి నిర్మల, చాకిరి వెంకట నారాయణ, చింతయ్య, పీఏసీఎస్ చైర్మన్ అల్లాడి థెరిస్సా, పార్టీ నాయకులు దోనవల్లి సూరిబాబు, గూడవల్లి రత్నసుధాకర్, కోడెబోయిన బాబి, కొమరవల్లి కిరణ్‌మూర్తి పాల్గొన్నారు.



వేలేరులో స్టిక్కర్లు ప్రదర్శిస్తున్న నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ, ఎంపీపీ నగేష్, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఆవిర్నేని శేషగిరిరావు తదితరులు

ప్రతి గడపకు అభివృద్ధి, సంక్షేమం

జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు



ఆర్థిక సాయం అందజేస్తున్న బాకీ బాబు, నత్తా వెంకటేశ్వరరావు

కంకిపాడు: అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి గడపనకూ తీసుకువెళ్లాలని జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు కోరారు. మండలంలోని గొల్లగూడెం గ్రామంలో సోమవారం గ్రామాభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సభ నిర్వహించారు. ఈ సందర్భంగా బాకీ బాబు మాట్లాడుతూ ప్రజల సంతృప్తికర స్థాయిని పెంచే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పథకాలను, సంక్షేమ కార్యక్రమాలను తీసుకువచ్చారని తెలిపారు. ఈ పథకాలను అందిపుచ్చుకుని కుటుంబాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని కోరారు.

జీవితాంతం ఆర్థిక సాయం

గ్రామానికి చెందిన పేద మహిళా మద్దా రాణికి అగ్రిబోర్డు మాజీ చైర్మన్ నత్తా వెంకటేశ్వరరావు రూ. వెయ్యి ఆర్థిక సాయం చేశారు. జీవితాంతం.. రాణికి ఆర్థిక సాయం అందజేస్తానని చెప్పారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందించడానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో జగనన్న సచివాలయాల మండలచైర్మన్ రాచూరి చిరంజీవి, ఎంపీటీసీ సభ్యురాలు విజయకుమారి, ఉప సర్పంచి మార్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ ప్యాడ్స్ పంపిణీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరురోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో సోమవారం గ్రంథాలయ సంఘం వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ టి.జమల పూర్ణమ్మ మాట్లాడుతూ.. గ్రంథాలయాలభివృద్ధికి సంఘం అందించిన సేవలు ఎంతగానో తోడ్పడ్డాయన్నారు. వ్యవస్థాపక దినోత్సవం పురస్కరించుకుని గుడ్లవల్లేరు పాలిటెక్నిక్ కళాశాల మెంటార్ నిమ్మగడ్డ రామాంజనేయులు తన తల్లి నిమ్మగడ్డ శార్వాణి జ్ఞాపకార్థం రూ.5 వేలు విలువైన 50 స్టడీ ప్యాడ్స్‌ను విద్యార్థులకు, పోటీ పరీక్షల అభ్యర్థులకు అందచేశారు.



విద్యార్థులకు స్టడీ ప్యాడ్స్ అందజేస్తున్న జమల పూర్ణమ్మ

కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కె.రమాదేవి, వై.ధనలక్ష్మి, సిబ్బంది కె.రాంబాబు, జే.శంకర్, గోపాలరావు, ఫణి బాబు విద్యార్థులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో ఆరోగ్య పరిరక్షణ

కంకిపాడు: ఫ్యామిలీ డాక్టర్‌తో ప్రజారోగ్య పరిరక్షణ సాధ్యమవుతుందని డాక్టర్ నిఖిత అన్నారు. ఈడుపుగల్లు సబ్ సెంటరులో ఉప్పలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యాన సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ నిఖిత రోగులకు పరీక్షలు చేసి మందులు అందించారు. అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలలను సందర్శించి ఆరోగ్య సూచనలు ఇచ్చారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని, శిబిరాలను వినియోగించుకోవాలని కోరారు.



ఈడుపుగల్లులో 'ఫ్యామిలీ డాక్టర్'లో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ నిఖిత

130 మందికి కంటి పరీక్షలు..

ఈడుపుగల్లు సబ్ సెంటర్‌లో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఉప్పలూరు పీహెచ్‌సీ ఆప్తాలమిక్ ఆఫీసర్ వి.వి. రాజేష్‌కుమార్ 60 ఏళ్లు నిండిన 130 మంది వృద్ధులకు కంటి పరీక్షలు చేసి మందులు, కళ్లజోళ్లు అందజేశారు. ఉచితంగా కంటి శుక్లాలకు ఆపరేషన్లు అందుబాటులో ఉన్నాయని శుక్లాల బాధితులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పీవీఆర్వీ ఆంజనేయులు, జి.అనిత, ఝాన్సీ, ఐఎస్‌బీఎస్ కుమారి, స్వరూప, స్వర్ణకుమారి, జయలక్ష్మి పాల్గొన్నారు.

ఆర్వోప్లాంట్ ప్రారంభం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో పుట్టగుంట సతీష్ హెల్త్ ఫౌండేషన్ ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది. రూ.2.50 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు డీఆర్వో కె.మోహన్‌కుమార్, పుట్టగుంట సతీష్‌తో కలిసి సోమవారం ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. కలెక్టర్ కార్యాలయానికి స్పందన, వివిధ పనుల నిమిత్తం వందలాది మంది వస్తుంటారన్నారు. వారి తాగునీటి అవసరాలు తీర్చేందుకు ఫౌండేషన్ ముందుకు వచ్చి ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పుట్టగుంట హెల్త్ ఫౌండేషన్ చైర్మన్ పి.వెంకట సతీష్ మాట్లాడుతూ తన ఫౌండేషన్ ద్వారా ఉమ్మడి జిల్లాలో అనేక సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించామన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. కలెక్టరేట్ ఏఓ ఇంతియాజ్ పాషా, అసిస్టెంట్ కలెక్టర్లు ఎస్.రామలక్ష్మి, ఖతీఫ్ కౌసరా బానో, లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ పూర్వ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చౌకధరల దుకాణం సీజ్

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడులోని ఐదో నంబర్ రేషన్‌షాపును పౌరసరఫరాల శాఖ అధికారులు సోమవారం సీజ్ చేశారు. మూడు నెలలుగా సక్రమంగా రేషన్ సరుకులు అందడం లేదని బియ్యం కార్డుదారులు ఫిర్యాదు చేయడంతో గన్నవరం పీడీఎస్ డెప్యూటీ తహసీల్దార్ ప్రధాన్ నేతృత్వంలో తనిఖీలు నిర్వహించారు. స్టాక్ రిజిస్టర్, రేషన్ సరుకుల నిల్వలను పరిశీలించారు. దీంతో రేషన్‌షాపులో 10.5 క్వింటాళ్ల బియ్యం, 19 కేజీల పంచదార తక్కువగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. రేషన్ షాపును సీజ్ చేయడంతో పాటుగా కేసు నమోదు చేస్తున్నట్లు డీటీ ప్రధాన్ తెలిపారు. బాపులపాడు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజేష్, వీఆర్వోలు శివయ్య, శివ సాంబ పాల్గొన్నారు.

చిత్రలేఖనంలో 'సెయింట్‌జాన్స్' ప్రతిభ

గన్నవరం: జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీల్లో స్థానిక వీఎస్ సెయింట్‌జాన్స్ హైస్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ బ్రదర్ సంతోష్‌కుమార్ తెలిపారు. సోమవారం పాఠశాల ప్రాంగణంలో పతకాలు సాధించిన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విజయవాడకు చెందిన యంగ్ అండ్ చిల్డ్రన్స్ ఆర్ట్స్ అకాడమీ ఇటీవల జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. తమ పాఠశాలకు చెందిన న్వయన్‌రెడ్డి సబ్ జూనియర్ విభాగంలో, కె.శశాంక్ జూనియర్, ఎం.మోక్ష, బి.సూరజ్ సీనియర్ కేటగిరిలో ప్రథమ స్థానం సాధించినట్లు చెప్పారు. అనంతరం విజేతలుగా నిలిచిన విద్యార్థులను, వీరికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు డి. శ్రీనివాసరావును అభినందించారు. సీనియర్ బ్రదర్ జిమ్మి కురియేకోస్, బ్రదర్ భల్లా జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

చురుగ్గా తాగునీటి పైప్‌లైన్ పనులు

రామవరప్పాడు: రూరల్ మండలం నిడమానూరు రామానగర్‌లో తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. జలజీవన్ మిషన్ ద్వారా సుమారు రూ. 20 లక్షల నిధులతో మంచినీటి పైప్‌లైన్ ఏర్పాటుకు ఇటీవల సర్పంచ్ శీలం రంగారావుతో పాటుగా పలువురు నాయకులు శంకుస్థాపన చేశారు. వేసవి దృష్ట్యా పైప్‌లైన్ పనులు త్వరితగతిన పూర్తి చేసి గ్రామస్తులకు అందుబాటులోకి తీసుకురానున్నారు. సర్పంచ్ శీలం రంగారావు మాట్లాడుతూ గ్రామంలో సురక్షిత తాగునీరు అందించడానికి ఈ పనులను యుద్ధప్రాతిపదికన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం గ్రామంలో నాలుగు వాటర్ ట్యాంకులు, మోటారు బోర్లు, మంచినీటి పైప్‌లైన్ల ద్వారా తాగునీరు సరఫరా అవుతుందని వివరించారు. కొత్తగా నిర్మించే పైప్‌లైన్ ద్వారా గ్రామం మొత్తానికి తాగునీరు సరఫరా చేయనున్నట్లు వివరించారు.

పంటల సాగుపై రైతులకు అవగాహన

పెనమలూరు: పంటల సాగు, మెలకువలపై అగ్రికల్చర్ విద్యార్థినులు రైతులకు అవగాహన కల్పించారు. పెనమలూరులో సోమవారం ఒడిశా సెంచురియన్ విశ్వవిద్యాలయం బ్యాచిలర్ అగ్రికల్చర్ డిగ్రీ విద్యార్థినులు ఎస్.మహేశ్వరి, పి.శ్రీలేఖ, ఊర్మిల రైతులను కలిసి వ్యవసాయ సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పంటలకు పురుగు, తెగులు ఆశిస్తే వాటిని నివారించడానికి పిచికారి చేసే సమయంలో తీసుకోవల్సిన జాగ్రత్తలు వివరించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు సాధించాలని, మట్టి నమూనా సేకరణ, విత్తన శుద్ధి, సాగు విషయాలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులకు సాగులో ఎదురవుతున్న సమస్యలను విద్యార్థినులు అడిగి తెలుసుకున్నారు.



పెనమలూరులో రైతులకు అవగాహన కల్పిస్తున్న అగ్రికల్చర్ విద్యార్థులు

పేదలకు ఆహార పదార్థాల పంపిణీ

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లా అధికార యంత్రాంగం నేతృత్వంలో సహాయ ఫౌండేషన్ ద్వారా సోమవారం పేదలకు ఆహార పదార్థాలు పంపిణీ చేశారు. నిరుపేదలకు ఆహారాన్ని అందించాలనే ఉద్దేశంతో కలెక్టర్ పి రంజిత్‌బాషా, అధికారుల సహకారంతో రూ. 25 వేలు ఇటీవల సహాయ ఫౌండేషన్‌కు నగదును అందజేశారు. జిల్లా యంత్రాంగం ఇచ్చిన నగదుతో ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు ఆహార పదార్థాల పంపిణీ కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్, డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు ప్రారంభించారు. జేసీ మాట్లాడుతూ ఎంతో మంది పేదలు ఆహారం లేక అలమటిస్తూ ఉంటారని వారికి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందించడం అభినందనీయమన్నారు. ఫౌండేషన్‌కు తన వంతు సహకారంగా రూ. 5 వేలు అందజేస్తున్నట్లు తెలిపారు. సంస్థ అధ్యక్షుడు ఎండీ ఉస్మాన్‌బాషా, న్యాయవాది బాలాజీ, బొమ్మిడి అయ్యప్పస్వామి, రౌతుల ప్రసాద్, కోన వెంకటేశ్వరమ్మ, తోకల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోపాటు క్రీడల్లోనూ ప్రతిభ చూపాలి

పెనమలూరు: విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ ప్రతిభ చూపాలని ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీ చైర్మన్ ధనేకుల రవీంద్రనాథ్‌ఠాగూర్ చెప్పారు. కబడ్డీ పోటీల్లో గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు ప్రథమ బహుమతి పొందారు. ఒంగోలులో ఈ నెల 8, 9 తేదీల్లో రైస్ కృష్ణసాయి విద్యాసంస్థల ఆధ్వర్యంలో రైస్ రేడియన్స్-2023 ఫెస్టు కబడ్డీ పోటీలు నిర్వహించారు. 'ధనేకుల' విద్యార్థులు పోటీల్లో ప్రథమ బహుమతి గెలిచారు. ఈ సందర్భంగా సోమవారం కాలేజీలో క్రీడాకారులను చైర్మన్ ఠాగూర్ అభినందించారు. కార్యక్రమంలో పీడీ కానుగుల సత్యనారాయణరావు, డైరెక్టర్ రవిప్రసాద్, ప్రిన్సిపాల్ కడియాల రవి తదితరులు పాల్గొన్నారు.



గెలుపొందిన జట్టుతో ధనేకుల కాలేజీ చైర్మన్ రవీంద్రనాథ్‌ఠాగూర్

వివాహిత కనిపించడం లేదని ఫిర్యాదు

పెనమలూరు: పోరంకిలో వివాహిత కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు అందడంతో సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ ఎం.కిషోర్ బాబు తెలిపిన వివరాల ప్రకారం పోరంకి తూముల సెంటర్‌లో ఉంటున్న బూరి రమాదేవి కుమార్తె సాగరికకు 2019లో వివాహమైంది, ఆమెకు భర్తతో విభేదాల కారణంగా పుట్టింట్లో ఉంటోంది. సాగరిక ఈ నెల 8వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాకపోవడంతో తల్లి రమాదేవి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆరోగ్య మాత దేవాలయంలో ప్రత్యేక ప్రార్థనలు

కంకిపాడు: కంకిపాడులోని ఆరోగ్యమాత దేవాలయంలో ఈస్టర్ సందర్భంగా ఆదివారం రాత్రి విశేష ప్రార్థనలు నిర్వహించారు. విచారణ గురువు ఫాదర్ ఎం.సాల్మన్‌రాజు పర్యవేక్షణలో విశ్వాసులు కొవ్వొత్తులు వెలిగించి క్రీస్తును ఆరాధించారు. దివ్యబలిపూజ సమర్పించి క్రీస్తు సందేశాన్ని వినిపించారు. క్రీస్తు బోధనలు పాటించాలని ఫాదర్ సాల్మన్‌రాజు సూచించారు. ప్రార్థనల్లో కంకిపాడు విచారణ పరిధిలోని పలు గ్రామాల విశ్వాసులు పాల్గొన్నారు.

13న శివాలయంలో కానుకల లెక్కింపు

పెనమలూరు: కానూరు గ్రామంలోని శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానం, శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానంల్లో హుండీల్లోని కానుకల లెక్కింపు జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణాధికారి వి.జేశ్వంత్‌కేదార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నెల 13వ తేదీ ఉదయం 9 గంటలకు ఆలయ ముఖమండపంలో భక్తులు స్వామివార్లకు హుండీల ద్వారా సమర్పించిన కానుకల లెక్కింపు అధికారుల సమక్షంలో జరుపుతామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న భక్తులు పాల్గొనవచ్చని తెలిపారు.

పెరటి పంటలు వేయండి

పెనమలూరు: భూమి లేని వారు ప్రకృతి వ్యవసాయం, ఇంటి ఆవరణలో పెరటి పంటలు సాగు చేయాలని రైతు సాధికారత సంస్థ అధికారి అరుణ అన్నారు. వణుకూరు గ్రామంలో సోమవారం స్వయం సహాయక సంఘాల సమావేశంలో ఆమె ప్రసంగించారు. సంఘాల సభ్యులు వారి ఇంటి ఆవరణలోనే పంట సాగు చేయాలని సూచించారు. ప్రకృతి సాగుకు అవసరమైన సూచనలు, సలహాలు, అవసరమయ్యే విత్తనాలు అందజేస్తామన్నారు. సమావేశంలో జిల్లా అదనపు ప్రాజెక్టు మేనేజర్ నాగమల్లీశ్వరి, సీసీలు ఝాన్సీ, అంకమ్మరాణి, యు.ఉదయకుమారి, జి.పారిజాతం, పి.లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

'మానవత'కు విశ్రాంత ఉపాధ్యాయుడి విరాళం

హనుమాన్‌జంక్షన్ రూరల్: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ హనుమాన్‌జంక్షన్ శాఖకు విశ్రాంత ఉపాధ్యాయుడు నెక్కంటి చిన్న సత్యనారాయణ రూ.25 వేల విరాళాన్ని సోమవారం అందించారు. మానవత అందిస్తున్న సేవా కార్యక్రమాలకు ఆకర్షితుడై తనవంతు సాయంగా విరాళంగా అందిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ మొత్తాన్ని మానవత జిల్లా అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావుకు అందించారు. హనుమాన్‌జంక్షన్ శాఖ అధ్యక్షుడు చక్కా సుబ్బారావు, సీనియర్ సభ్యులు వడ్డి రాజేశ్వరరావు, సుబ్బాచారి, కంభంపాటి నాగేశ్వరరావు, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

• దొండ పందిరి నీడలో..



ప్రస్తుతం ఎండలు విపరీతంగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. యనమలకుదురు సమీపంలో ఎండ తగలకుండా దొండ పందిరి నీడలో పని చేస్తున్న మహిళా కూలీలను సాక్షి కెమెరా 'క్లిక్'మనిపించింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ